# నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, సోమవారం 10 జూన్ 2024 | MEDAK




సంగారెడ్డిలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రంలో నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## సజావుగా గ్రూప్-1 ప్రిలిమ్స్

### సంగారెడ్డి జిల్లాలో 77.85 శాతం అభ్యర్థులు హాజరు

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 9: జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా ముగిసింది. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించగా, రెండు, మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అధికారులు పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. జిల్లాలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, పలు పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ వల్లూరు క్రాంతి సందర్శించి పరిశీలించారు. మొత్తం 9672 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 7530 మంది హాజరయ్యారు. 2142 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. దీంతో 77.85 శాతం హాజరు నమోదైంది. స్థానిక సేయింట్ ఆంథోనీస్ పాఠశాల కేంద్రంలో ఐదుగురు అభ్యర్థులు రెండు నిమిషాలు ఆలస్యంగా రావడంతో పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. దీంతో చేసేదేమీ లేక వారు వెనుదిరిగి వెళ్లారు. జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ఈ సందర్భంగా సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగిందని తెలిపారు.

**సిద్దిపేట జిల్లాలో 81.38 శాతం మంది అభ్యర్థులు హాజరు**

సిద్దిపేట అర్బన్, జూన్ 9: సిద్దిపేట జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష సజావుగా ముగిసింది. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని 21 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు 8,230 మంది అభ్యర్థులకు 6705 మంది హాజరై 81.38 హాజరు శాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పలు పరీక్షా కేంద్రాలను కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులు, సెక్యూరిటీ ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష సజావుగా ముగిసిందన్నారు. మొత్తం 8,230 మంది అభ్యర్థులకు 6,705 మంది అభ్యర్థులు హాజరై 1534 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్, గ్రూప్-1 ప్రిలిమ్స్ నోడల్ అధికారి గరీమాఅగర్వాల్ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిద్దిపేట సీపీ అనురాధ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి



# రైతు భరోసా ఏదీ?

## సాయం కోసం రైతుల ఎదురుచూపు

- వానకాలం సాగుపనులు షురూ
- విత్తనాలు, ఎరువులకు వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు పెడుతున్న అన్నదాతలు
- రైతుల ఇబ్బందులను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- కేసీఆర్ ప్రభుత్వంలో సాగుకు ముందే అందిన పంట పెట్టుబడి





సిద్దిపేట, జూన్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రోహిణి కార్తె పోయి... మృగశిర కార్తె వచ్చింది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా వానలు పడుతున్నాయి. అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. అదును దాటితే పంట దిగుబడి కష్టం. ఈ పరిస్థితుల్లో అన్నదాత పంట పెట్టుబడి సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. విత్తనాలు, ఎరువులు కొందామంటే చేతిలో రూపాయి లేక రైతులు వడ్డీ వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న వ్యాపారులు అధిక ధరలకు విత్తనాలు అమ్మడమే గాక, కొన్నిచోట్ల అమాయక రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగుకు ముందే పంట పెట్టుబడి సాయం అందింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇంత వరకు 'రైతు భరోసా'పై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇంతకు రైతు భరోసా ఇస్తారా...? లేదా..? అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మొన్నటి యాసంగి పంటకు సంబంధించిన సాయం కూడా పూర్తి స్థాయిలో వేయలేదని రైతులు చెబుతున్నారు.

**కురుస్తున్న వర్షాలు**

నాలుగైదు రోజులుగా సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. రైతులకు అవసరమైన విత్తనాలు దొరకక ఇబ్బంది పడుతున్నారు. సరైన విత్తనం దొరికితేనే పంట అధిక దిగుబడి వస్తుంది. అది కాకుండా కొన్ని కంపెనీలకు చెందిన విత్తనాలను మాత్రమే అందుబాటులో ఉంచడంతో రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. తమకు కావాల్సిన విత్తనాల కోసం బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేద్దామంటే రైతుల వద్ద చేతిలో రూపాయి లేక వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు పెడుతున్నారు. వారు ఇచ్చిన విత్తనాలు, ఎరువులు తీసుకుంటున్నారు తప్పా... రైతులకు నచ్చిన విత్తనాలు లభ్యం కావడం లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతు భరోసా ఇస్తే రైతులకు అనుకూలంగా ఉంటుంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎకరాకు రెండు పంటలకు రూ. 10 వేలు ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరాకు రెండు పంటలకు రూ. 15 వేలు ఇస్తానని హామీ ఇచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం ఈ వానకాలం సాగుకు ఎకరాలకు రూ. 7,500 ఇవ్వాలి కదా ..! ఎప్పుడు ఇస్తారు అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అని చెప్పి గత యాసంగి రైతు బంధును నిలిపివేయడంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు. రైతులు అధిక వడ్డీలకు అప్పులు తీసుకువచ్చి తమ పంటలను కాపాడుకున్నారు. చివరికి పంట చేతికి రాకపోవడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కనీసం ఆ రైతుల కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం పలకరించిన పాపాన పోలేదు. పంటలను కాపాడుకోవడానికి తమ వద్ద ఉన్న పాస్‌బుక్కులు, బంగారం, ఇతర వస్తువులను వడ్డీ వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టారు. ఇవన్నీ గత ఏప్రిల్‌లో పోలీసుల తనిఖీల్లో వడ్డీ వ్యాపారులు తాకట్టు పెట్టుకున్న విషయం బయట పడ్డాయి. రైతుల వద్ద నుంచి ముక్కు పిండి వడ్డీ వసూలు చేసినట్లు స్పష్టంగా కనిపించింది. సిద్దిపేట జిల్లాలో వడ్డీ వ్యాపారులపై 42 కేసులు నమోదు చేసి రూ.1,39,79,580 రూపాయల 286 ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో చాలా మంది వడ్డీ వ్యాపారులు పరారీలో ఉన్నారు. లెక్క తేలనివి చాలా ఉన్నాయి. ఇది కొద్ది మంది వడ్డీ వ్యాపారుల వద్ద దొరికనవి మాత్రమే అని చెప్పాలి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పుట్టుగొడుగుల్లా ఫైనాన్స్‌లు వెలిశాయి. నూటికి నెలకు మూడు రూపాయల నుంచి నాలుగు రూపాయల పైన వసూలు చేస్తున్నారు. ప్రతి నెలా వడ్డీ వసూలు చేస్తున్నారు. జిల్లాలో ప్రైవేట్ ఫైనాన్స్ యజమానులు సాగు సమయంలో రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. సాగు సమయంలో రైతులు పంట పెట్టుబడి సాయం కోసం తప్పని పరిస్థితుల్లో అప్పులు చేయాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతులకు రైతు భరోసా అందిస్తే వడ్డీ వ్యాపారుల నుంచి రైతులకు ఉపశమనం కలుగుతుంది.

**కేసీఆర్ ప్రభుత్వం 11 విడతల్లో రూ. 8,771 కోట్లు జమ చేసింది**

రైతుబంధు ప్రారంభించి నాటి నుంచి గత వానకాలం వరకు (11వ విడతల్లో) సిద్దిపేట జిల్లాలో 29,33,494 మంది రైతులకు రూ. 3,124.82 కోట్లు, మెదక్ జిల్లాలో 24,69,637 రైతులకు రూ.2,027.37 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 31,95,960 మంది రైతులకు రూ.3,619.54 కోట్లు, మొత్తం ఉమ్మడి మెదక్ జిల్లాలో 85,99,091 మంది రైతులకు రూ. 8,771.73 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో కేసీఆర్ ప్రభుత్వం జమ చేసింది.

**రైతుబంధు సాయం (2018 మే నుంచి 2023 ఆగస్టు వరకు 11 విడతల్లో)**

| జిల్లా పేరు | రైతులు | అందిన సాయం |
|---|---|---|
| సిద్దిపేట | 29,33,494 | రూ. 3,124.82 కోట్లు |
| మెదక్ | 24,69,637 | రూ. 2,027.37 కోట్లు |
| సంగారెడ్డి | 31,95,960 | రూ. 3,619.54 కోట్లు |
| మొత్తం | 85,99,091 | రూ. 8,771.73 కోట్లు |



# ఆయిల్‌పామ్ హబ్‌గా సిద్దిపేట

### లాభదాయకమైన పంట ఆయిల్‌పామ్.. నా చేతుల మీదుగా పంట కోయడం అదృష్టంగా భావిస్తున్నా: హరీశ్‌రావు



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో మొదటి పంట గెలలను కోస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



ఆయిల్ పామ్ గెలలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు

- రూ.300 కోట్లతో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు జరుగుతున్నాయి
- ఆయిల్‌పామ్ సాగులో ఖమ్మం జిల్లా తర్వాత సిద్దిపేటనే..
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో పంటకోత షురూ..

సిద్దిపేట అర్బన్/ నంగునూరు, జూన్ 9: ''ఆయిల్‌పామ్ సాగులో సిద్దిపేట జిల్లా ఆదర్శంగా నిలిచిందని.. ఆయిల్‌పామ్‌కు సిద్దిపేట హబ్‌గా మారుతుంది'' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో ఆయిల్‌పామ్ మొదటి పంట గెలలు కోసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ లాభదాయక పంట అని.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించిందన్నారు. ఇందుకు ఫలితంగా ఆయిల్‌పామ్‌ను సిద్దిపేట జిల్లాలో అధికంగా సాగు చేశారన్నారు. నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని రూ.300 కోట్లతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలోనే గంటకు 120 టన్నుల క్రషింగ్ చేసే కెపాసిటీ ఉన్న ఫ్యాక్టరీ నర్మెటలో నిర్మాణం జరుగుతోందన్నారు. వచ్చే ఏప్రిల్ నాటికి నర్మెట ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభమవుతుందన్నారు. నర్మెట ఫ్యాక్టరీలో క్రషింగ్ మాత్రమే కాకుండా రిఫైనరీ యూనిట్ ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లాతో పాటు జనగామ, మహబూబాబాద్, గద్వాల్, నారాయణపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి పామాయిల్ ఈ ఫ్యాక్టరీకే వస్తుందన్నారు. జిల్లాలో మూడు నర్సరీలు ఏర్పాటు చేశామని.. రైతులకు అవసరమయ్యే మొక్కలు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో లక్ష ఎకరాల్లో సాగు చేస్తారని.. సిద్దిపేట జిల్లాలో 11 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారని.. రాష్ట్రంలో ఖమ్మం జిల్లా తర్వాత ఆయిల్‌పామ్ సాగులో ద్వితీయ స్థానంలో సిద్దిపేట ఉందన్నారు. సిద్దిపేట జిల్లాలో డిసెంబర్ నెలాఖరులోగా వెయ్యి ఎకరాల్లో మొదట పంట కోతకు వస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగులో నంగునూరు మండలం ఆదర్శంగా నిలిచిందన్నారు. దేశంలో 40 శాతం మాత్రమే ఆయిల్‌పామ్ ఉత్పత్తి అయితే.. 60 శాతం దిగుమతి చేసుకుంటున్నామన్నారు. తెలంగాణలో రూ. 20 లక్షల ఎకరాల్లో సాగు చేసేందుకు నాడు గులాబీ అధినేత కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధంచేసిందన్నారు. నర్మెటలో నిర్మించ తలపెట్టిన ఫ్యాక్టరీలో రెండు వేబ్రిడ్జీలు పూర్తయ్యాయని.. పది కోట్ల లీటర్ల ఫాంపాండ్, ఇతర నిర్మాణాలు పూర్తయ్యాయని.. వచ్చే సంవత్సరం ఏప్రిల్ 25 వరకు పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. పామాయిల్‌తో పాటు అంతర పంటలైనా కోకో, వక్క పంటలు సాగు చేస్తే అధికలాభాలు ఉంటాయన్నారు. ఎకరాకు లక్షా 20 వేల వరకు లాభం వస్తుందన్నారు.



**మొదటి పంట కోయడం సంతోషంగా ఉంది..**

ఆయిల్‌పామ్ సాగు మొదటి గెలలు కోయడం సంతోషంగా ఉందని హరీశ్‌రావు అన్నారు. ఆదర్శ రైతు నాగేందర్ కోరిక మేరకు ఆయిల్‌పామ్ తోటకు వచ్చి తొలి పంట కోయడం సంతోషకరమని.. నాడు మొదటి మొక్క తనతో నాటించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ రైతులందరికీ అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. నంగునూరు మండలం రాబోయే రోజుల్లో కోనసీమను తలపిస్తుందన్నారు. మొదటి మొక్కను నాటించి.. మొదటి గెలను కోయించడం చాలా అదృష్టంగా భావిస్తున్నట్లు రైతు నాగేందర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

**వానకాలం రైతు భరోసా విడుదల చేయాలి**

గతంలో కేసీఆర్ ప్రభుత్వం వానకాలం ప్రారంభం కాగానే.. రైతుబంధు విడుదల చేసేదని.. కానీ ఈ ప్రభుత్వం ఇంకా రైతు భరోసా నిధులు విడుదల చేయడం లేదని హరీశ్‌రావు అన్నారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారని.. కానీ దానిపై ఏమీ మాట్లాడటం లేదని.. వెంటనే రైతుబంధు నిధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలు పడుతుండటంతో రైతులకు విత్తనాలు, ఎరువు బస్తాల కోసం పెట్టుబడి సహాయం అందించాలన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రైతుభరోసా విడుదల చేయాలన్నారు. రైతులందరికీ తక్షణం ఎకరానికి రూ.7500 ఇచ్చి ఆదుకోవాలన్నారు. జనుము, జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు దొరకడం లేదని రైతులు చెబుతున్నారని.. వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదన్నారు. వెంటనే రాష్ట్రమంతా పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువుల కొరత రాకుండా అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

**అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలి**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిందని నేడు మాట మార్చి సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామని చెబుతున్నదని.. రాష్ట్రంలో 90 శాతం దొడ్డు వడ్లు మాత్రమే పండుతాయని హరీశ్‌రావు అన్నారు. రైతులను అన్యాయం చేయకుండా అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కోల రమేశ్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు లింగంగౌడ్, ఎడ్ల సోమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్టారెడ్డి, సారయ్య, మల్లయ్య పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో రైతు నాగేందర్‌ను సన్మానిస్తున్న హరీశ్‌రావు

**దిగుమతులపై కస్టమ్ డ్యూటీని పెంచాలి**

గతంలో దేశంలో ఆయిల్‌పామ్ దిగుమతికి 15 శాతం నుంచి 43 శాతం కస్టమ్ డ్యూటీ ఉండేదని.. దాన్ని అలాగే ఉంచితే రైతులకు లాభం చేకూరుతుందన్నారు. ఆయిల్‌పామ్‌కు కస్టమ్ డ్యూటీని వేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ టన్నుకు నేడు రూ.13,438 ఉందని.. కస్టమ్ డ్యూటీ ఉంటే ఆయిల్‌పామ్ ధర పెరిగి.. రైతులకు ధర పెరుగుతుందన్నారు. రైతును కాపాడుకోవాలంటే పామాయిల్ దిగుమతి పై కస్టమ్ డ్యూటీ వేయాలన్నారు. దీనిపై కేంద్రం స్పందించాలన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పామాయిల్ రైతులను చిన్నచూపు చూస్తుందని.. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రాప్ మెయింటెనెన్స్ కింద సంవత్సరానికి రూ.4200 ఇచ్చిందని, ఈ ప్రభుత్వం పూర్తిగా దాన్ని వేయడం లేదన్నారు. డ్రిప్ కంపెనీలకు సైతం డబ్బులు ఇవ్వడం లేదని.. ప్రభుత్వం స్పందించి ఆ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన విధంగా మొక్కల కోసం ఇచ్చే సబ్సిడీ విడుదల చేయాలన్నారు.



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలో సంక్షేమ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


## కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

అమీన్ పూర్, జూన్ 9: కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఎన్ఆర్ఐ ఆనంద్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీహాల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ.. ప్రగతి పథంలో ముందుకెళ్తున్నామన్నారు. అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. సంక్షేమ సంఘం భవనానికి సంపూర్ణ సహకారం అందించిన మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్‌ను అభినందించారు. అనంతరం బీరంగూడలోని గోశాలను సందర్శించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

పాపన్నపేట, జూన్ 9: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కొత్తపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మల్లేశం (38) ఓ వ్యక్తి వద్ద భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత ఏడాది కురిసిన వడగండ్లకు పంట దెబ్బతిని నష్టం జరిగింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. ఈ క్రమంలో గతనెల 30న కౌలుకు తీసుకున్న భూమి వద్దకు వెళ్లి అక్కడ పురుగుల మందు తాగాడు. భార్య గమనించి అతడిని మెదక్ జిల్లా దవాఖానకు తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స చేయించి అనంతరం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.




మల్లేశం (ఫైల్ )

## రెండు తలలతో దూడ జననం

**గంటల వ్యవధిలో ఆవు, దూడ మృతి**

చిన్నశంకరంపేట, జూన్ 9: రెండు తలలతో దూడ జన్మించి మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం రుద్రారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు నర్సింహులు ఆవు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పురిటి నొప్పులతో బాధపడుతూ అవస్తలు పడింది. వెంటనే ఈ విషయాన్ని మండల పశువైద్య సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది నవీన్, గోపాలమిత్ర మహేశ్ ఆవుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రెండు గంటలకు పైగా శ్రమించి దూడను అతికష్టం మీద బయటకు తీశారు. దూడ బయటికి రాగానే రెండు తలలు ఉండటాన్ని గమనించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్దఎత్తున దూడను చూడటానికి తరలివచ్చారు. దూడ బయటకు రాగానే మృతి చెందిందని వైద్య సిబ్బంది తెలిపారు. జన్యు లోపం వల్లనే రెండు తలలతో దూడ జన్మించిందని, ఆవు కూడా మృతిచెందిందని వారు తెలిపారు.



రెండు తలల దూడను చూపుతున్న పశువైద్య సిబ్బంది